సాక్షి అనంతపురం

శనివారం । 17 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేల ప్రకారం అమ్మకాలు జరిగినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు.



జూడాల ఆందోళన ఉధృతం

కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో నిందితులను శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని అనంతపురంలో జూడాలు నిరసన కొనసాగించారు. 8లో

గరిష్టం/కనిష్టం
37.4°/24.3°

అనంతపురం జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

అక్కడక్కడ వర్షాలు

- నేడు, రేపు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం, ఉపరితల ద్రోణి, ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నా... వేసవిలో మాదిరిగా ఉక్కపోత అధికంగానే కొనసాగుతోంది. అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు నమోదవుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 12 మండలాల్లో 5.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కణేకల్లు 35.2 మి.మీ, బ్రహ్మసముద్రం 22.2 మి.మీ, శెట్టూరు 22.2 మి.మీ, కుందుర్పి 18.6 మి.మీ, బొమ్మనహాళ్ 14.2 మి.మీ, గుమ్మగట్ట 12.8 మి.మీ, బెళుగుప్ప 12.4 మి.మీ, కళ్యాణదుర్గం 11.2 మి.మీతో పాటు మరికొన్ని మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే శుక్రవారం సాయంత్రం కూడా ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణం 88.3 మి.మీ కాగా ప్రస్తుతానికి 46.7 మి.మీ నమోదైంది. అలాగే ఈ ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి 163 మి.మీ గానూ 34 శాతం అధికంగా 218.8 మి.మీ నమోదైంది. 20 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. కాగా ఎల్లో అలర్ట్ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం, ఆదివారం వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో రైలు టికెట్

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌లోని అన్ని రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌తో టికెట్లు కొనుగోలు చేయొచ్చని సీనియర్ డీసీఎం మనోజ్ శుక్రవారం తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పేలోని క్యూఆర్ కోడ్ సదుపాయం తొలుత ప్రధాన రైల్వేస్టేషన్లలో మాత్రమే అమలు చేశామని, ప్రస్తుతం అన్ని స్టేషన్లలోనూ అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా నూతన ఎస్పీగా జగదీష్



అనంతపురం: జిల్లా నూతన ఎస్పీగా పి.జగదీష్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పి.జగదీష్ తొలి పోస్టింగ్ గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్. అనంతరం పాడేరు, చిత్తూరు ఏఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో అనంతపురంలో 14వ బెటాలియన్ కమాండెంట్‌గా కొద్దికాలం పనిచేశారు. ఆ తర్వాత తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇదిలా ఉండగా రాహుల్ మీనాను గుంతకల్లు రైల్వే ఎస్పీగా నియమించారు. చింతూరు అసిస్టెంట్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు.

అడిషనల్ ఎస్పీగా రమణమూర్తి

జిల్లా అడిషనల్ ఎస్పీగా డీవీ రమణమూర్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈయన్ను అప్పా నుంచి ఇక్కడికి బదిలీ చేసింది. ఇక్కడ అడిషనల్ ఎస్పీగా ఉన్న ఆర్.విజయభాస్కర్ రెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.అప్పా అడిషనల్ ఎస్పీగా బి.శ్రీభవాని హర్షను నియమించింది.

వరములిమ్ము.. వరమాలక్ష్మీ!



తాడిపత్రిలో వరలక్ష్మీ అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాలతో పాటు కొందరు మహిళలు తమ ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహాన్ని కొలువుదీర్చి పూలు, పట్టువస్త్రాలతో అలంకరించి వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. బంధుమిత్రులు, ముత్తయిదువులను ఆహ్వానించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చారు.



ఆత్మకూరులోని ఓ ఇంటిలో పూజలందుకున్న వరలక్ష్మీఅమ్మవారు



అనంతపురం కొత్తూరు అమ్మవారి శాలలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ ఖర్చు వివరాలు	
అన్నా క్యాంటీన్ ప్రాంతం	వ్యయం (రూ.లక్షల్లో)
అనంతపురం బళ్లారి జంక్షన్	11.5
అనంతపురం జూనియర్ కళాశాల	10
అనంతపురం గుత్తి రోడ్డు	7.5
గుంతకల్లు	7.5
కళ్యాణదుర్గం	38
గుత్తి	37.50 (నూతన భవనం)
తాడిపత్రి	9
రాయదుర్గం	5



ఈ చిత్రంలో కనిపిస్తున్నది అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురంలోని గ్రామ సచివాలయం- 3 భవనం. 2021లో అప్పటి ప్రభుత్వం నిర్మించింది. రెండస్తుల్లో సువిశాల భవనాన్ని అత్యంత అధునాతనంగా తీర్చిదిద్దారు. ఈ భవనాన్ని కేవలం రూ.40 లక్షలతో నిర్మించారు.



ఈ చిత్రంలో ఉన్నది అనంతపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో జూనియర్ కళాశాల వెనుకవైపు ఉన్న అన్నా క్యాంటీన్. ఈ క్యాంటీన్‌ను టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. ఈ క్యాంటీన్‌లో ప్రస్తుతం పునరుద్ధరణ పనులకు ఏకంగా రూ.10 లక్షలు కేటాయించారు.

తమ్ముళ్లకు నిధుల భోజనం!

అన్నా క్యాంటీన్ల పేరుతో దోపిడీ

- ఇష్టారాజ్యంగా టెండర్ల నిర్వహణ
- జిల్లాలోని 5 మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలో పునరుద్ధరణ పనులు
- పనులకు రూ.1.26 కోట్ల కేటాయింపు
- అనంతపురంలో వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే పనులు
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు



తాడిపత్రిలోని గాంధీనగర్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ పనులకు రూ.9 లక్షలు కేటాయించారు. పైపై మెరుగులు దిద్ది రూ.లక్షల ప్రజాధనం వృథా చేసేందుకు పాలకులు సిద్ధమయ్యారు.



ఇది గుంతకల్లులో ఇదివరకే ఉన్న అన్నా క్యాంటీన్. క్యాంటీన్ మరమ్మతు కోసం రూ.7.5 లక్షలు వెచ్చిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ప్రాంతంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి తన సొంత నిధులతో వైఎస్సార్-వైవీఆర్ క్యాంటీన్ పేరిట దాదాపుగా రెండేళ్ల పాటు కేవలం రూ.6కే రుచికరమైన భోజనం అందించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో క్యాంటీన్ నిర్వహణ నిలిచిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ మరమ్మతుల పేరిట ముందు భాగంతోపాటు లోపలి భాగంలో పనులకు రూ.7.5 లక్షలు వెచ్చించింది.

అనంతపురం కార్పొరేషన్: అన్నా క్యాంటీన్ల పేరుతో ప్రభుత్వం టీడీపీ నేతలకు నిధుల విందు భోజనం పెడుతోంది. పేదలకు కడుపు నిండా భోజనం పెట్టడాన్ని ఎవరూ వద్దనరు. అయితే ఆ పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని నగరపాలక సంస్థ, 5 మునిసిపాలిటీల్లో రూ.1.26 కోట్లతో అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఆ పనులకు సంబంధించి ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు.

'అనంత'లో మూడు క్యాంటీన్లకు రూ.29 లక్షలు

అనంతపురంలోని మూడు ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కోసం దాదాపుగా రూ.29 లక్షలు కేటాయించారు. అన్నా క్యాంటీన్లలో వైరింగ్, పెయింటింగ్, కౌంటర్ ఏరియా, బాత్‌రూంలు, సర్వీస్ ప్రాంతం తదితర వాటికి రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. గతంలో ఒక్కో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు రూ.35 లక్షలు వెచ్చించారు. ఇప్పుడు కేవలం మరమ్మతులకు రూ.లక్షలు వెచ్చించడం చర్చనీయాంశంగా మారింది.

పునరుద్ధరణ పనులకు ఏకంగా రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేయడమే అభ్యంతకరం. టీడీపీ అనుయాయులైన కాంట్రాక్టర్లకు భారీగా లబ్ధి చేకూర్చేందుకు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు తిలోదకాలు

అనంతపురం నగరపాలక సంస్థ అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా టెండర్ నిర్వహణ పూర్తయ్యాకే సదరు కాంట్రాక్టర్‌కు పనులు చేసేందుకు అనుమతివ్వాలి. కానీ ఇక్కడటువంటి పరిస్థితి కన్పించలేదు. గత నెల 11న టెండర్లను ఆహ్వానించి, 18న టెక్నికల్ బిడ్ ఓపెన్ చేశారు. కాంట్రాక్టర్‌కు ఎటువంటి వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే పనులు మొదలుపెట్టేశారు. అందులోనూ టెండర్‌లో ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే పాల్గొనడం గమనార్హం. ఒకరు మాత్రమే పాల్గొంటే మరోసారి టెండర్లను పిలిచే అధికారం నగరపాలక సంస్థ అధికారులకు ఉంది. కానీ ఆ నిబంధనలను ఏమీ పాటించలేదు. టీడీపీ నాయకుల సిఫార్సులకు అధికారులు రెడ్‌కార్పెట్ వేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కళ్యాణదుర్గంలోని అన్నా క్యాంటీన్‌ను టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే నిర్మించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అదే గదికి చిన్న చిన్న మరమ్మతులు, రంగులు వేయడానికి ఏకంగా రూ.38 లక్షలు ఖర్చు చేస్తున్నారు.



ఇది అనంతపురం గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం వద్దనున్న అన్నా క్యాంటీన్. ఇందులో పునరుద్ధరణ పనులకు రూ.7.5 లక్షలు కేటాయించారు. ఈ క్యాంటీన్‌లో అద్దాలు, బాత్‌రూం డోర్లు, నీటి కుళాయి మూతలు, తదితర వాటి కోసం ఈ మొత్తం వెచ్చించారు.



అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ జంక్షన్‌లో ఇది వరకే ఉన్న అన్నా క్యాంటీన్ ఇది. ఈ క్యాంటీన్ పునరుద్ధరణ కోసం ఏకంగా రూ.11.05 లక్షలు వెచ్చించారు.



రాయదుర్గంలోని ఈ అన్నా క్యాంటీన్‌లో పునరుద్ధరణ పనులకు రూ.5 లక్షలు కేటాయించారు. గతంలోని పాత భవనానికే మెరుగులు దిద్దారు. చిన్నపాటి మరమ్మతులకే రూ.లక్షలు ధారపోశారు.

కప్పం కడతారా.. మూసేసుకుంటారా!

కప్పం వసూలుకు కాదేదీ అనర్హమని నిరూపిస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రతి అంశాన్నీ ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ఆత్రుత పడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారు. అధికారం అండతో అందిన కాడికి దోచుకునేందుకు యత్నిస్తున్నారు. ఈక్రమంలో బార్ల యాజమాన్యాలు నెల వారీ మామూళ్లు ఇవ్వాలని, లేని పక్షంలో బార్లు మూసేసుకోవాలని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

- నెల మామూళ్లు ఇవ్వాలని బార్ల యాజమాన్యాలపై టీడీపీ నేతల ఒత్తిడి
- కప్పం కట్టబోమని, అవసరమైతే బార్లు మూసేస్తామన్న యాజమానులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయి. ఆదాయ మార్గాల అన్వేషణలో ఎవరినీ వదలడం లేదు. రేషన్ డీలర్లు మొదలుకొని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం వరకూ చెలరేగిపోతున్నారు. తాజాగా వారి కన్ను బార్లపై పడింది. ఇంకేముంది కప్పం కట్టు..లేదా బార్ మూసుకో అంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 26 వరకూ బార్లు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా అనంతపురంలోనే ఉన్నాయి. కొంతమంది టీడీపీ నేతలు బార్ల యాజమాన్యాల వద్దకు వెళ్లి నెలవారీ మామూళ్లు ఇవ్వాలని లేదంటే బార్లు ఎలా నడుపుతారో చూస్తామని అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల సంఘం నేత మధ్యవర్తిత్వం

గతంలో ఎక్సైజ్ సీఐ హోదాలో పనిచేసిన, ఎక్సైజ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న వ్యక్తి బార్ల యాజమాన్యాలు, టీడీపీ నేతలకు వసూళ్లపై మధ్యవర్తిత్వం నెరిపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అనంతపురం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ బార్ యజమానిని సంప్రదించి నెల మామూళ్లు ఇవ్వాలని కోరారు. మిగతా అందరినీ కూడా పిలిచి సదరు నేతకు నెలకు ఒక్కో బార్‌కు ఇంత అని ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. అనంతరం ఆ యజమాని మిగతా వారికి సమాచారం చేరవేయడంతో అసలు కథ మొదలైంది.

భగ్గుమన్న బార్ల యాజమాన్యాలు..

ఇప్పటికే బార్ల నిర్వహణ కష్టంగా ఉందని, ఏనాడూ లేనిది రాజకీయ నేతలకు కప్పం కట్టడమేంటంటూ మిగతా యాజమాన్యాలు భగ్గుమన్నట్లు తెలిసింది. ఒక్కపైసా ఇచ్చేది లేదు ఏం చేసుకుంటారో చేసుకోమని, అవసరమైతే బార్లు మూసుకుంటాం కానీ డబ్బు ఇవ్వలేమంటూ తెగేసి చెప్పినట్లు సమాచారం. ఈ ఏడాది బార్లకు లైసెన్సు ఫీజు రెన్యూవల్ కట్టడం లేదని, మీరే బార్లు తీసుకుని తమకు నెలకు కొంత సొమ్ము ఇవ్వండి అంటూ రివర్స్ అయినట్లు తెలిసింది. ఈక్రమంలో మధ్యవర్తి అయిన ఎక్సైజ్ అధికారుల సంఘం నేత వారిని బుజ్జగించే పనిలో ఉన్నట్లు సమాచారం.

సంఘం నేత బావమరిదికి ఇవన్నీ వర్తించవా?

అధికారుల సంఘం నేతగా చలామణి అవుతున్న వ్యక్తి బావమరిదికి అనంతపురంలోని గుత్తిరోడ్డులో టిప్రుల్ ఎస్ బార్ ఉంది. అధికారులకు కానీ, పోలీసులకు కానీ ఎవరికైనా సరే ఈ బార్ నుంచి ఎలాంటి మామూళ్లు ఉండవు... మిగతా బార్లన్నీ కట్టాలా అంటూ ఓ బార్ యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతమందికని మామూళ్లు ఇవ్వాలని, ఇలా వసూళ్లకు వస్తే ఒక్క పైసా ఇచ్చేది లేదని, ఇంతకంటే చెప్పేదేమీ లేదని కొంతమంది యాజమానులు సాక్షితో అన్నారు. ఇప్పటికే నెలకు రూ.లక్షకుపైగా ఒక్కో బార్‌కు చెల్లిస్తున్నామని, ఇక తమ వల్ల కాదని వాపోయారు.



ఒక్కో బార్‌కు నెలవారీ మామూళ్లు ఇస్తున్న తీరు ఇలా	
కేటగిరీ	నెలకు సొమ్ము
ఎక్సైజ్ అధికారులకు	రూ.45,000
సెబ్ అధికారులకు	రూ.40,000
లిక్కర్ గోడౌన్ సిబ్బందికి	రూ.20,000
(ఇవి కాకుండా స్థానిక సివిల్, ట్రాఫిక్ పోలీసులకు బార్‌లో అప్పుడప్పుడు మందు, ఫుడ్డు ఇవ్వాల్సి ఉంటుంది)	

రాజుకుంటోన్న బియ్యం రగడ

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లాలో బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న బియ్యం అన్నీ ఇన్నీ కావు. గడిచిన మూడు రోజులుగా అనంతపురం పాతూరులో భారీగా చౌక బియ్యం పట్టుకున్నారు. అధికార పార్టీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడివిగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మాజీ ఎమ్మెల్యేకు అనుంగు అనుచరుడని, ఈయన బ్లాక్‌మార్కెట్‌కు తరలించే విషయంలో ఘనాపాటి అని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'మత్తు'పై ఉక్కుపాదం మోపుదాం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ మురళీకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: 'గంజాయి వంటి మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి. ప్రత్యేక నిఘా ఉంచి వాటి క్రయవిక్రయాలు, రవాణా, వినియోగానికి అడ్డుకట్టవేయాలి. 'అనంత'ను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేద్దాం' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి ఎన్‌సీఓఆర్‌డీ (నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం, అమ్మకంపై గట్టి నిఘా ఉంచాలన్నారు. వీటి వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఔషధ దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వజనాస్పత్రిలోని డి-అడిక్షన్ వార్డులో సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి సాగు, రవాణాపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో నో డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ, ఆర్డీఓలు, డీఎంహెచ్ఓ ఈ.బీ దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ వెంకటేశ్వరరావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఏసీఎస్ కంప్యూటరైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

- కలెక్టర్ వినోద్‌కుమార్


ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాప్తాడు రూరల్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు సంబంధించి కంప్యూటరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి సెప్టెంబర్‌లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పీఏసీఎస్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జిల్లాలోని 58 సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు గుర్తు చేశారు. జిల్లాలోని 57 సంఘాలకు సెంట్రల్ బ్యాంక్, మరో సంఘానికి యూనియన్ బ్యాంక్ ఫైనాన్స్ చేస్తోందన్నారు. ఆయా సంఘాల్లో మెంబర్‌ఫిప్, లోన్లు తదితర అన్ని రికార్డులను కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలన్నారు. సంఘంలో రుణాలు మంజూరు, డిపాజిట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ తదితర వాటికి సంబంధించి కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ అరుణకుమారి, డీఎల్సీఓ ప్రభాకర్ రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓ శ్రీనివాసులు, డీసీసీబీ సీఈఓ స్వరూపారాణి ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో 34 మందిపై కేసు నమోదు

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లిలో గురువారం సాయంత్రం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి శుక్రవారం 34 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన 12 మందిపై, అలాగే టీడీపీకి చెందిన గంగరాజు ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గార్లదిన్నె: ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. వివరాలను శుక్రవారం ఆమె వెల్లడించారు. అనంతపురానికి చెందిన టిప్పు సుల్తాన్, మహేష్ నాయక్... గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గురువారం రాత్రి ఐచర్ వాహనంలో తరలిస్తూ కోటంక ఆంజనేయస్వామి ఆలయం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులకు పట్టుబడ్డారు. వాహనంలో 28 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనానిన సీజ్ చేసి, నిందితులపై కేసు నమోదు చేశారు.

కౌలుకోనివ్వరా..?


విత్తన సాగుకు సిద్ధం చేసిన పొలం

ఎన్నో ఆశలతో ఆ రైతన్నలు పొలాలు సాగు చేస్తుంటారు. తమకు భూములు లేకున్నా, కౌలుకు మాట్లాడుకుని పంటలు పెడుతుంటారు. ఈ క్రమంలో సాధారణ రైతుల మాదిరిగానే వారినీ పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం చేయూతనిచ్చింది. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం ఆ రైతుల పట్ల చిన్నచూపు చూస్తోంది.

- పంట సాగు పత్రాల అందజేతపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఖరీఫ్ ప్రారంభమై రెండున్నర నెలలవుతున్నా అలసత్వం
- రాయితీలు కల్పించాల్సి వస్తుందనే మౌనం
- కౌలు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన గత ప్రభుత్వం
- లక్ష్యానికి మించి సీసీఆర్‌సీల పంపిణీ
- అందరికీ 'వైఎస్సార్ రైతు భరోసా' జమ

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే కౌలు రైతులకు సీసీఆర్‌సీ (పంట సాగు హక్కు) పత్రాలు పంపిణీ చేయాలి. అప్పుడే వారు అన్ని పథకాలకూ అర్హత సాధిస్తారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ కౌలు పత్రం ఆధారంగా రాయితీ విత్తన పంపిణీ మొదలు పంటల బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు, వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సాయం అందజేసి కౌలు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కౌలు రైతులకు తీరని నష్టం చేకూరేలా వ్యవహరిస్తోంది.

రాయితీలు అందించాల్సి వస్తుందనే!

జిల్లాలోని 31 మండలాల్లో ఈ ఏడాది 8,330 మంది కౌలు రైతులకు కార్డులను అందించాలని లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటి వరకు 3,077 కౌలు రైతుల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. విత్తనాలు, ఎరువులన్నీ బయట మార్కెట్లో కొన్నాక సీసీఆర్‌సీలు ఇస్తున్నారని, దీంతో ప్రయోజనమేముందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులు ఎంతమంది ఉన్నా సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో 6,220 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీలు అందించాలని లక్ష్యం నిర్దేశించగా, అంతకు మించి 6,666 మందికి పంపిణీ చేశారు. సకాలంలో సీసీఆర్‌సీలు అందడంతో వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సాయం కౌలు రైతుల ఖాతాల్లో జమయింది. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందుకున్నారు. వ్యవసాయ పరికరాలు కూడా రాయితీపై లభించాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఆ దిశగా అడుగులు వేయలేకపోయింది. సకాలంలో సీసీఆర్‌సీలు మంజూరు చేస్తే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనం, ఎరువులు, ఇతర ఉపకరణాలు అందించాల్సి వస్తోందనే విధివిధానాల పేరుతో జాప్యం చేస్తున్నారని కౌలు రైతులు మండిపడుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

యజమానుల నుంచి భూములను పొంది కౌలు రైతులు వాటిల్లో పంటలు సాగు చేస్తారు. ఈ క్రమంలో కౌలు కార్డు అందాలంటే భూ యజమాని అనుమతి తప్పనిసరి. అయితే, క్షేత్రస్థాయిలో అవగాహన లేక చాలా మంది పొలాల యజమానులు సీసీఆర్‌సీలపై నిరాసక్తత ప్రదర్శిస్తుంటారు. అలాంటి వారి అపోహలు తొలగించి, ఒప్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నా, జిల్లాలో ఎక్కడా నిర్వహించకపోవడం గమనార్హం.

జిల్లాలో ఈ ఏడాది కౌలు కార్డుల లక్ష్యం	8,330	గతేడాది లక్ష్యం	6,220
ఇప్పటి వరకు పంపిణీ చేసిన కార్డులు	3,077	పంపిణీ చేసిన కార్డులు	6,666

ఇప్పడిచ్చినా ఉపయోగం లేదు



కౌలు పత్రం జూన్‌లో ఇస్తేనే రైతులకు ప్రయోజనముంటుంది. అందరితో పాటు రాయితీ విత్తనం, ఎరువులు, బ్యాంకు రుణాలు పొందవచ్చు. ఆగస్టు రెండో వారం వచ్చినా కౌలు కార్డులు ఇవ్వలేదు. అందుకే వాటిని అడగడం కూడా మానేశాం. గత ఏడాది సకాలంలో కార్డు ఇవ్వడంతో రాయితీలన్నీ వర్తించాయి. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 జమైంది. కూటమి ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

– బోయ కమార్, పూలకుంట, గుమ్మఘట్ట మండలం

త్వరలో లక్ష్యం పూర్తి చేస్తాం



కౌలు రైతులకు నిర్దేశించిన లక్ష్యం మేరకు సీసీఆర్‌సీలు అందిస్తాం. గత వారం నుంచి ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశాం. త్వరలో లక్ష్యం చేరుకుంటాం. ఈ విషయానికి సంబంధించి ఇప్పటికే మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. అర్హత కలిగిన ప్రతి రైతుకూ కౌలు కార్డు అందిస్తాం.

– ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి

11 మంది కౌన్సిలర్ల సస్పెన్షన్

- గీతదాటిన వారిపై వైఎస్సార్ సీపీ వేటు

సాక్షి, పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా విజయం సాధించి గురువారం టీడీపీలో చేరిన 11 మంది హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లపై ఆ పార్టీ అధిష్టానం వేటు వేసింది. పార్టీ ఫిరాయించిన 11 మంది కౌన్సిలర్లను సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా పార్టీ నియమాలను ఉల్లంఘించిన మరో ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. సస్పెండ్ అయిన కౌన్సిలర్లలో డీఎస్ ఇంద్రజ (19వ వార్డు), నసీరా బాను (7వ వార్డు), గిరీశ్‌కుమార్ (8వ వార్డు), షేక్ రమహత్‌బీ (12వ వార్డు), సునీత (13వ వార్డు), పరుశురామ్ (20వ వార్డు), అయుబ్ (23వ వార్డు), నాగేంద్రమ్మ (27వ వార్డు), మల్లికార్జున (28వ వార్డు), రేష్మాబాను (32వ వార్డు), నాగమణి (34వ వార్డు) ఉన్నారు. వీరితో పాటు కార్యకర్తలు షఫీ (కింగ్–సి), వెంకటరెడ్డి, బాబు (కిరోసిన్) కూడా ఉన్నారు.

దమ్ముంటే రాజీనామా చేయండి..

ఒక పార్టీలో గెలిచి.. మరో పార్టీలో చేరడం 'పాలు తాగిన.. రొమ్మును గుద్దడమే' అని నవీన్ నిశ్చల్ అన్నారు. రాజకీయంగా గొప్ప అవకాశం ఇచ్చి.. ప్రజా ప్రతినిధులను చేసి.. పిన్న వయసులోనే అత్యున్నత బాధ్యతలు అప్పజెప్పిన పార్టీకి నమ్మక ద్రోహం చేసి డబ్బులకు అమ్ముడుపోవడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. దేవుడి వంటి వైఎస్ జగన్‌ను మోసగించి.. టీడీపీలో చేరడం సబబు కాదన్నారు. టీడీపీలో ఏనాడూ కులాల వారీగా న్యాయం జరగలేదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఓ పార్టీలో గెలిచి.. మరో పార్టీలో చేరేవారు.. తమ పదవులకు రాజీనామా చేయాలని నవీన్‌నిశ్చల్ సవాల్ విసిరారు. దమ్ముంటే.. ఉప ఎన్నికలకు వెళ్లి పోటీ చేయాలన్నారు. ఏనాడూ మున్సిపల్ కార్యాలయం మెట్లు కూడా ఎక్కని వారికి.. రాజ్యాధికారం కట్టబెడితే.. పార్టీ మారి.. వారి రాజకీయ భవిష్యత్ నాశనానికి పునాదులు వేసుకున్నారన్నారు. ఓ పార్టీలో గెలిచిన వారిని.. రాజీనామా చేయకుండానే ఆహ్వానించిన ఎమ్మెల్యేకు రాజకీయ పార్టీల నిబంధనలు తెలియవా? అని నవీన్‌నిశ్చల్ ప్రశ్నించారు. పార్టీలు మారే వారిని సహించేది లేదన్నారు.

'ఇన్‌చార్జ్' పాలనకు తెర!

- ఐసీడీఎస్‌లో త్వరలో పదోన్నతులు
- పీడీగా రావడానికి సీనియర్ సీడీపీఓ, కోస్తా నుంచి మరో అధికారి ప్రయత్నం
- ప్రస్తుతం అస్తవ్యస్తంగా పాలన



ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమ శాఖలో త్వరలో 'ఇన్‌చార్జ్' పాలనకు తెరపడే సూచనలు కన్పిస్తున్నాయి. త్వరలోనే సీడీపీఓలకు పదోన్నతులు రానున్న నేపథ్యంలో రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) నియామకం జరుగుతుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలో సీనియర్ అధికారిగా ఉన్న కంబదూరు సీడీపీఓ వనజా అక్కమ్మ, కోస్తా జిల్లా నుంచి ఒక పురుష సీడీపీఓతో పాటు మరికొందరు ఆశావహులు పీడీ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఐసీడీఎస్ కొంతకాలంగా ఇన్‌చార్జ్ పీడీ పాలనలో నడుస్తోంది. సీనియారిటీని కాదని జూనియర్‌కు పదవి అప్పగించారు. దీంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది.

- జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1.75 లక్షల మంది చిన్నారులతో పాటు యుక్తవయసు బాలికలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరికి ప్రతి రోజూ ఒక పూటకు సరిపడే బియ్యం, బ్యాళ్లు, నూనె, కోడి గుడ్లు, పాలు, ఇతరత్రా బలవర్థకమైన ఆహారాన్ని అందించాల్సి ఉంది. గర్భిణులు, బాలింతలకు ఇళ్లకే నిత్యావసర సరుకులు అందజేయాల్సి ఉండగా.. చిన్నారులకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వండి వడ్డించాల్సి ఉంటుంది. అయితే కొన్ని నెలలుగా నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. కాంట్రాక్టర్లు సరఫరా చేయలేదన్న విషయాన్ని కలెక్టర్, ఆ పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచన కూడా ఇక్కడి అధికారులు చేయడం లేదు.

అడిగే వారు లేరని..

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఇన్‌చార్జ్ ఉన్నతాధికారి తీరు విమర్శలకు తావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం లేదు. జిల్లా కేంద్రానికే పరిమితమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, హెల్పర్లు తమకు తోచిన విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు తప్పా జిల్లా, మండల స్థాయిలో ఆ ఊసే లేదు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా బాల్య వివాహాలు కొనసాగుతుండడంతో పాటు లైంగిక వేధింపులూ అధికమవుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగుచూసింది. తాజాగా పామిడిలో ఓ బాల్య వివాహం జరిగింది. ఇన్ని జరుగుతున్నా ఐసీడీఎస్ అధికారుల హడావుడి తప్పా నివారణ చర్యలు చేపట్టడం లేదు.

అవార్డులపైనా విమర్శలు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో అవార్డులకు ఎంపిక చేసిన తీరుపై చాలా మంది సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై పరేడ్ మైదానంలోనే ఉన్నతాధికారిని నిలదీసినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ఒక అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్‌ను మాత్రమే అవార్డులకు ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

15 ఏళ్ల బాలిక హస్తలాఘవం

- మహిళను ఏమార్చి నగలు, నగదు అపహరణ

పామిడి: పట్టుమని 15 ఏళ్లు కూడా లేని ఓ బాలిక తన హస్తలాఘవాన్ని ప్రదర్శించింది. మహిళను ఏమార్చి నగలు, నగదు అపహరించుకెళ్లింది. ఈ ఘటన పామిడిలోని యూనియన్ బ్యాంక్ శాఖలో చోటు చేసుకోవడం గమనార్హం. వివరాలు... పామిడిలోని విద్యుత్ శాఖ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న ఆచారీ యంత్ర పరికరం కొనుగోలుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పామిడిలోని తన భార్య వరలక్ష్మికి ఫోన్ చేసి డబ్బు తక్కువ పడిందని, వెంటనే సర్దుబాటు చేయాలని తెలిపాడు. దీంతో ఆమె తన వద్ద ఉన్న 1.5 తులం బంగారు నగను తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంతో ఇంట్లో ఉన్న రూ.5,600ను భర్తకు పంపాలని నిశ్చయించుకుని ఓ ప్లాస్టిక్ కవర్‌లో ఉంచుకుని యూనియన్ బ్యాంక్ శాఖకు చేరుకుంది. ఈ క్రమంలో బ్యాంక్‌లో ఆమె లావాదేవీలు చూసుకుని బంగారు నగ తీసిచ్చేందుకు కవర్‌ను చేతిలోకి తీసుకోగానే అది ఖాళీగా కనిపించింది. అందులో ఉన్న నగతో పాటు నగదు కనిపించలేదు. సమాచారం అందించడంతో సీఐ రాజశేఖరరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. బ్యాంక్‌లోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. బ్యాంక్‌లో ప్రవేశించినప్పటి నుంచి ఓ బాలిక (సుమారు 15 సంవత్సరాల వయస్సు) ఆమె చుట్టూ తిరుగుతూ ఉన్నట్లు గమనించారు. వరలక్ష్మి నగ తాకట్టు విషయంగా మాట్లాడుతున్న సమయంలో ఆమెకు తెలియకుండా ప్లాస్టిక్ కవర్‌ను బ్లేడ్‌తో కోసి నగతో పాటు నగదూ అపహరించుకెళ్లిన దృశ్యాలు గమనించి, పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూడాల ఆందోళన ఉధృతం

- అత్యవసర సేవలకు దూరంగా జూనియర్ డాక్టర్లు
- జూనియర్ డాక్టర్ల సమ్మెకు ఐఎంఏ, ఏఎస్ఐ మద్దతు
- మొత్తం 430 మంది వైద్యులు, హౌస్‌సర్జన్లు విధులకు దూరం
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన బోధనాస్పత్రి అధికారులు


నిరసన తెలుపుతున్న జూడాలు, హౌస్ సర్జన్లు

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ బోధనాస్పత్రి (జీఎంసీ)లో జూడాలు ఆందోళన ఉధృతం చేశారు. శుక్రవారం జూడా, హౌస్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో నిరవధిక నిరసనలు మొదలుపెట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జీజీహెచ్ ఎదుట గంటకుపైగా మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. జీఎంసీలో 300 మంది పీజీలు, 131 మంది హౌస్‌సర్జన్లు విధులకు దూరంగా ఉంటున్నట్లు జూడా అధ్యక్షుడు హరికిరణ్ తెలిపారు.

ప్రత్యామ్నాయ చర్యలకు నిర్ణయం..

జూడాలు, వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో జీఎంసీ ప్రిన్సిపాల్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెచ్‌ఓడీలు సమావేశమయ్యారు. రోగులకు అసౌకర్యం కల్గకుండా 29 సర్వీస్ పీజీలు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్లు, ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఫిజియోథెరపిస్టులతో సేవలందించాలని నిర్ణయించారు. వీలైతే ఐఎంఏ వైద్యుల సహకారం తీసుకోవాలని తీర్మానించారు.

రోగుల అవస్థలు..

జీజీహెచ్‌లో జూడాలు సమ్మెలోకి వెళ్లడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. జీజీహెచ్ ఉన్నతాధికారులు కేవలం ఎమర్జెన్సీ సేవలపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. శుక్రవారం గైనిక్, అత్యవసర విభాగం, ఏఎంసీ తదితర విభాగాల్లో వైద్యులు కన్పించారు. స్టాఫ్‌నర్సులే ఇంజెక్షన్లు వేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

నేడు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేత

జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నగరంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీడీ సేవలు, అత్యవసరం కాని శస్త్రచికిత్స పూర్తిస్థాయిలో నిలిపివేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు వైద్య సేవల ఉపసంహరణకు మద్దతు తెల్పుతున్నట్లు అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ కే శివశంకర్ రావు, గౌరవ కార్యదర్శి డాక్టర్ ఫణిమహేష్‌రెడ్డి పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్ట్


బత్తలపల్లి: ఒంటరి మహిళలను ఏమార్చి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర మహిళా దొంగలు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన రాధమ్మ తన భర్త మోహనయ్యతో కలసి బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి కొన్ని రోజుల క్రితం వచ్చింది. తిరుగు ప్రయాణంలో భర్త ముందుగా వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 12న రాధమ్మ ఒక్కతే బస్సు ఎక్కి స్వగ్రామానికి బయలుదేరింది. బత్తలపల్లిలో ఆమెను అనుసరిస్తూ బస్సు ఎక్కిన ఆగంతకులు ఆమె బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలను అపహరించారు. విషయాన్ని గుర్తించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఉదయం బత్తలపల్లి సమీపంలోని ఓ ధాబా వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో రాధమ్మ బంగారు నగల అపహరణకు పాల్పడింది తామేనని వారు అంగీకరించారు. పట్టుబడిన వారిని తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా సిప్‌కాట్‌కు చెందిన వెంకటేష్ కుమార్తె కలయ్‌వాని అలియాస్ కళ్యాణి, వెంకట్రామన్ భార్య వి.రేఖ, తిరువన్నామళై జిల్లా కట్టమడువు గ్రామానికి చెందిన శివ భార్య గాజుల భారతిగా గుర్తించారు. వీరి నుంచి ఏడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి తమ అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. ప్రయాణికుల దృష్టిని ఏమార్చడంతో పాటు మత్తు మందు ప్రయోగించి చోరీలు సాగిస్తున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ


దొంగతనం జరిగిన ఓబిరెడ్డి ఇల్లు

రాప్తాడు రూరల్: పట్టపగలే రెండు ఇళ్లలో దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన ఓబిరెడ్డి సీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ విరమణ పొంది ప్రస్తుతం వడియంపేట సమీపంలోని హెచ్‌పీసీఎల్‌లో పనిచేస్తున్నారు. వరి మడికి మందులు కొనుగోలు చేసేందుకు గురువారం ఉదయం 10.10 గంటలకు ఇంటికి తాళం వేసి బయలుదేరారు. 10.35 గంటలకు ఆయన సోదరుడు ఫోన్ చేసి దొంగతనం జరిగిందని చెప్పడంతో హడావుడిగా ఇంటికి చేరుకుని పరిశీలించాడు. బీరువాలో భద్రపరిచిన 11.50 తులాల బంగారు నగలు ఉన్న కవర్‌ను అపహరించుకెళ్లినట్లు గుర్తించాడు. ఆయన ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న కిషోర్‌రెడ్డి ఇంట్లోనూ దొంగలు చొరబడి 1.5 తులాల బంగారాన్ని అపహరించారు. ఈ రెండు ఘటనల్లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఒడిశా, ఢిల్లీ విజయం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికగా జరుగుతున్న ఆల్ ఇండియా జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో శుక్రవారం ఒడిశా, ఢిల్లీ జట్లు విజయం సాధించాయి. ఉదయం ఒడిశా, మిజోరం మధ్య జరిగిన మ్యాచ్‌లో 11–0 గోల్స్ తేడాతో ఒడిశా జట్టు గెలుపొందింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ– ఛత్తీస్‌ఘడ్ జట్లు తలపడ్డాయి. 5–0 గోల్స్ తేడాతో ఢిల్లీ జట్టు గెలుపొందింది. మ్యాచ్‌లను అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీటీ ఫైనాన్స్ డైరెక్టర్ సంజీవ్ ప్రారంభించారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం: రాయలసీమ జిల్లాల్లోని 28 మంది సీఐలు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న వి. ప్రభాకర్ రెడ్డిని నంద్యాల జిల్లా సీసీఎస్–2 సీఐగా బదిలీ చేశారు. యాడికి సీఐగా ఉన్న ఎస్.రోషన్‌ను కమలాపురం సీఐగా బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న వై.నరేంద్రరెడ్డిని పీసీఆర్(పోలీస్ కంట్రోల్ రూం), కడపకు బదిలీ చేశారు.

28న ప్రతిభా పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ఈ నెల 28న అవోపా (ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్) సహకారంతో వాసవీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులుశెట్టి శుక్రవారం వెల్లడించారు. 8 నుంచి పీజీ వరకూ ప్రతి తరగతిలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ మెరిట్ అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి చేయూతనిస్తామన్నారు. ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల్లో సమాచార లోపమున్నందున వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని, సంబంధీకులు అనంతపురం రాజు రోడ్డులోని అవోపా కార్యాలయంలో వివరాలు అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 94907 27460లో సంప్రదించాలని కోరారు.

వరాలివ్వు.. వరలక్ష్మీ మాత


గాజుల అలంకారంలో నిమిషాంబా దేవి

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసం రెండవ శుక్రవారం నగరంలోని పలు ఆలయాలు, ప్రతి ఇంటా వరలక్ష్మీ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వరమాలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని మంగళతోరణాలు కట్టి శ్రావణ లక్ష్మీని సాదరంగా ఆహ్వానించారు. కొత్తూరు, పాతూరు అమ్మవారి శాలల్లో పెద్ద ఎత్తున మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించారు. మహిళలు వాసవీ మాత ఎదురుగా కూర్చుని వేదపురోహితుల వేద మంత్రాలకు అనుగుణంగా కుంకుమార్చన నిర్వహించారు. రామ్‌నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున అభిషేకాలు, కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది. పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబా దేవి గాజుల అలంకారంలో దర్శనమిచ్చింది. ఉమానగర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి, హౌసింగ్ బోర్డులోని వేదమాత గాయిత్రీ దేవి ఆలయం, మొదటి రోడ్డులోని చౌడేశ్వరీ దేవి, నీరుగంటి వీధి, శివకోటిలోని లలితా శివకామేశ్వరి దేవతలకు పూజలు చేశారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం ఆచరించారు. తమ ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలకరించారు. కొంత డబ్బు అమ్మవారి దగ్గర ఉంచి తమకు ఎప్పుడు మంచి జరగాలని పూజలు చేపట్టారు.


ఆదర్శనగర్‌లో పూజలందుకున్న వరలక్ష్మీ మాత


కొత్తూరు అమ్మవారి శాలలో పూజలు


వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న మహిళ


రాంనగర్‌లోని పెద్దమ్మ గుడిలో పూజలు


వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

క్లుప్తంగా

రీవాల్యూయేషన్ ఫలితాల విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల విడుదల చేసిన బీఏ, బీకాం, బీఎస్సీ హానర్స్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకరయ్య విడుదల చేశారు. మొత్తం 30 మంది విద్యార్థినులు రీవాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఇద్దరు పాస్ అయ్యారు. కళాశాల లింక్‌లో ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ హెచ్.శివ శంకర్, రామలింగారెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టండి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం సెంట్రల్: బాల్య వివాహాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న ఆదేశించారు. శిక్షణలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. రాయలసీమ జిల్లాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతాయనే అపోహను తొలగించాలని సూచించారు. పామిడిలో బాల్య వివాహం, తల్లులు ఆత్మహత్య చేసుకోగా అనాథలైన పిల్లల సంక్షేమంపై ఎలాంటి చర్యలు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. కార్యాక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాల కోసం వినతి


మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ప్రభుత్వ పాఠశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ద్వారా క్రీడా పరికరాలు సరఫరా చేసేలా చూడాలని క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్ఏపీఈఏ) నాయకులు కోరారు. శుక్రవారం కడప ఆర్టీసీ అతిథి గృహంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పీఈటీల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు శివశంకర్ రెడ్డి, సీనియర్ పీడీ సుబ్రమణ్యం ఉన్నారు.

నగరంలో వసూళ్లు, బెదిరింపులు మొదలయ్యాయి

- ఎస్పీకి ప్రభాకర్‌చౌదరి ఫిర్యాదు

అనంతపురం: గతంలో ఎన్నడూ లేని రీతిలో నగరంలో అనేక రకాల నిర్బంధ వసూళ్లు, బెదిరింపుల పర్వం మొదలైందని అనంతపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత వి.ప్రభాకర్ చౌదరి ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ప్రతి విషయంలోనూ రాజకీయ జోక్యం అధికమైందని, స్థానికేతరులు, అరాచకశక్తులు ముఠాగా ఏర్పడి, అధికారం అనే బూచిని చూపిస్తూ, వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఇతర వ్యక్తుల్ని బెదిరించే సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. ఇలాంటి ఘటనలు తన దృష్టికి వస్తున్నాయని, అవసరమైతే ఆధారాలు అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మచ్చలేని జీవితం తనదని, తనపైనే బురద జల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

ఉత్తమ పనితీరుకు ప్రశంస


మంత్రి కేశవ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఐఅండ్‌పీఆర్ ఏపీఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి



దామోదర్, పీఆర్ఓ,


శ్రీనివాసులు, కంప్యూటర్ ఆపరేటర్


రాఘవేంద్ర, డీఆర్ఓ సీసీ


ఈశ్వరయ్య, కలెక్టరేట్ రికార్డ్ అసిస్టెంట్


మారుతీ ప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సీసీ


ప్రశాంత్ బాబు, సీనియర్ అసిస్టెంట్

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేశారు. ఈనెల 15న నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు గ్రహీతలకు మంత్రి పయ్యావుల కేశవ్ విశిష్ట సేవా ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

రేపు గద్దర్ వర్ధంతి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజా గాయకుడు గద్దర్ మొదటి వర్ధంతిని విజయవంతం చేద్దామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గద్దర్ వర్ధంతి పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 18న జిల్లా పరిషత్ హాల్‌లో బహుజన యువసేన, సామాజిక న్యాయ వేదిక ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వర్ధంతి సభకు గద్దర్ కూతురు వెన్నెలమ్మ, అరుణోదయ కళామండలి విమలక్క, ప్రజా కళాకారులు, ఉద్యమ నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ రైట్స్ కేపీ రాజు, సమతా సైనిక్ దళ్ సుగుమంచి శ్రీనివాసులు, ఎరుకల ప్రజా హక్కుల పోరాట సమితి ఉమామహేశ్వరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ సిబ్బందికి అవార్డులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్పీ నరసింహులు, అటెండర్ సోము స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. వీరికి శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి అవార్డులు అందజేశారు. సీఆర్పీ నరసింహులు, అటెండర్ సోమును కార్యాలయ సిబ్బంది అభినందించారు.

డాక్టర్లను కాపాడుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: తల్లి జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మనిస్తారు. అలాంటి డాక్టర్లను కాపాడుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయి స్వామి మాట్లాడారు. మహిళలపై కామాంధుల అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు వచ్చినా డబ్బున్న వారికి చుట్టాలుగా మారుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతు, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప, జిల్లా నాయకులు రాధా జ్యోతి, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సమీర్, తారక్, నాని, మన్సూర్, వరుణ్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దుండగులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం అర్బన్: కలకత్తాలో వైద్య విద్యార్థినిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ, ఏఐవైఎఫ్, మహిళ సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాటాడుతూ.. హత్యకు చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, అల్లీపీరా, సంతోష్ కుమార్, యశోదమ్మ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు కలిశారు. ప్రైవేట్ స్కూల్స్ యజమానుల సమస్యలను విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, కార్యదర్శి చంద్ర, నగర అధ్యక్షుడు శ్రీనాథ్, రవిశంకర్, ప్రసాద్ రెడ్డి, రవీంద్రారెడ్డి, అన్వర్, జలీల్, రామ్మూర్తి, సంజీవరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.


మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అపుస్మా నాయకులు

రేపటి నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధన ఉత్సవాలు ఈనెల 18 నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. తొలిరోజు గోపూజ, ధ్వజారోహణం, లక్ష్మీపూజ, ధాన్యోత్సవం 19న రుగ్వేద, యజుర్వేద సహిత ఉపాకర్మ, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 20న పూర్వారాధన, 21న మధ్యారాధన, 22న ఉత్తరారాధన మంత్రాలయ క్షేత్రంలో జరిగినట్టే నిర్వహిస్తామని మఠం మేనేజర్ తెలిపారు. చివరి మూడు రోజుల పాటూ నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్మాల విసర్జన, వేదపారాయణం, క్షీరాభిషేకం, పాదపూజలు, కనకాభిషేకం, హస్తోదక అలంకార సేవలు, రజక రథోత్సవం జరుగుతాయన్నారు. చివరి రోజున పురవీధుల్లో రథోత్సవం ఉంటాయని భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట


అలంకరణలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయుడి విగ్రహాలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీరామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుడి విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. ఇందుకోసం మూడు రోజులుగా వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలతో పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ప్రాతఃకాల పూజ, విగ్రహాలకు రుద్రాభిషేకం, మూలమంత్ర జపములు, గణపతి, నవగ్రహ, సుదర్శన, ఆది దేవత హోమాలు చేపట్టినట్లు అర్చకులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 7:45 గంటలకు విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

డ్రైడే పాటించాలి

అనంతపురం కార్పొరేషన్: వారంలో ఒక రోజు డ్రైడే తప్పక పాటించాలని డీఎంఓ ఓబులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని భాగ్యనగర్‌లో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆ ప్రాంతంలో తొట్టెలు, డ్రమ్ముల్లో ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ రెగ్యులర్‌గా చేయించాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తిని ఆదేశించారు.


భాగ్యనగర్‌లో పర్యటించిన డీఎంఓ ఓబులు

భక్తిశ్రద్ధలతో నిజరూప పాదదర్శనం


పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో పుత్రద ఏకాదశి వేడుకల సందర్భంగా శుక్రవారం దేవతామూర్తుల నిజరూప పాదదర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఉదయం జరిగిన నిజరూప పాదదర్శనంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని ఆరాధించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకుడు ఆనంద్ మాట్లాడుతూ.. సాక్షాత్తు లక్ష్మీదేవి రుక్మిణీ పాదాలను తాకి ప్రత్యేక వ్రతం ఆచరించదని పురాణాలు చెబుతున్నాయన్నారు. ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కల్గిస్తున్నట్లు తెలిపారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

కోతుల బెడదకు చెక్


కోతులను పట్టి బోనులో వేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శుక్రవారం నగరంలోని 12వ డివిజన్‌లోని పాతూరులో తిరుపతికి చెందిన ఓ ఏజెన్సీ నిర్వాహకులు కోతులను పట్టుకుని బోనులో బంధించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. నగరంలోని ఎక్కడైతే కోతుల బెడద ఉందో ఆ ప్రాంత వాసులు నగరపాలక సంస్థ కంట్రోల్ రూంకు ఫోన్ చేస్తే సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులను పంపి కోతులను తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాటిని పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలేస్తామని తెలిపారు. సదరు ఏజెన్సీకి ఒక్కో కోతిని పట్టుకునేందుకు రూ.400 చెల్లించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి 120 కోతులు పట్టేందుకు ఉత్తర్వులిచ్చినట్లు పేర్కొన్నారు.

కాకి పిల్లపై కనికరం


అరవింద నగర్ ప్రధాన రోడ్డు పక్కన కాలువలో పడిపోయిన కాకిపిల్లను బయటకు తీస్తున్న వాహనదారుడు

మనిషి తన సంతానంపై మమకారం చూపితే.. పశువులు, పక్షులు ప్రేమ పంచుతాయి.. బంధం, అనుబంధం ఎవరికైనా సహజమే.. పశుపక్ష్యాదులకు పోలిక ఉన్నట్లే.. మనిషి మరో మనిషిని పోల్చి చెప్పుకుంటుంటాం. పక్షులంటే ప్రేమకు ప్రతీకలంటుంటాం.. కాకులంటే శకునంగా భావిస్తాం.. అలాంటి ఓ కాకి పిల్ల ఎగిరే ప్రయత్నంలో రోడ్డుపై పడిపోయింది. నిత్యం రద్దీగా ఉండే అరవింద నగర్‌లో అటూ ఇటూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే.. ఎటూపోలేక కాకిపిల్ల కావ్.. కావ్ అంటూ రెక్కలు కొడుతోంది. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తికి కాకిపిల్ల ఆర్తనాదాలు చూసి కనికరం పుట్టింది. వాహనాల కింద పడిపోకుండా కాపాడే ప్రయత్నం చేశాడు. ఎలాగోలా రోడ్డుపక్కనున్న మురుగుగుంట వద్దకు తరిమి.. కాసిన్ని నీళ్లు తాపి, ఆ పక్కనే ఉన్న ప్రహరీలోకి తోలాడు. అనంతపురంలోని అరవిందనగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఈ దృశ్యాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


కాకిపిల్లకు నీరు తాపుతున్న దృశ్యం

నగరపాలక సంస్థ ఎస్ఈగా సూర్యనారాయణ


ఎస్ఈ సూర్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఈఈగా ఉన్న సూర్యనారాయణకు ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ ఎస్ఈకి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ, జిల్లా సహాయాధ్యక్షుడు శివశంకర్, ఉపాధ్యక్షులు నరసింహ, మహేష్, రామాంజనేయులు, చిరంజీవి, భగీరథ రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని కమలానగర్‌లోని ఓ ఆసుపత్రి పక్కన ఉండే భవనంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.